సాక్షి వరంగల్

బుధవారం । 20 । సెప్టెంబర్ । 2023



రుణమాఫీ డబ్బు జమచేయాలి

రుణమాఫీ పథకంలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన డబ్బు వెంటనే బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలంటూ రైతులు డిమాండ్ చేశారు.

- 8లో▸



కేయూకు ముగిసిన సెలవులు

కేయూకు ఈ నెల 18వ తేదీతో సెలవులు ముగిశాయి. మంగళవారం నుంచి తరగతులు ప్రారంభమయ్యాయి.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
34^0 /25^0

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

22న ఉద్యోగమేళా

కాశిబుగ్గ సెంటర్: ములుగు రోడ్డు సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 22న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎస్. మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ఫ్లిప్‌కార్ట్ కంపెనీలో పనిచేసేందుకు 30 మందిని ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. పదో తరగతి చదివి, 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉండాలని తెలిపారు. ఎంపికైన వారికి రూ.18,000 నుంచి రూ.20,000 వేతనం ఇస్తారని పేర్కొన్నారు. వివరాలకు 7799314685 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

శిక్షణకు నెక్కొండ సర్పంచ్ ఎంపిక



నెక్కొండ: తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమానికి నెక్కొండ మేజర్ గ్రామ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారెడ్డి ఎంపికయ్యారని డీపీఓ కల్పన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 23 వరకు హైదరాబాద్ రాజేంద్రనగర్‌లో జరిగే శిక్షణ కార్యక్రమంలో పాల్గొననున్నట్లు ఆమె పేర్కొన్నారు. జిల్లా నుంచి ఆమెతోపాటు మరో ఐదుగురు సర్పంచ్‌లు ఎంపికయ్యారని తెలిపారు. మహిళా ప్రజాప్రతినిధులు రాబోయే రోజుల్లో రాజకీయ, సామాజిక రంగాల్లో మరింత రాణించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదపడుతాయని తెలిపారు.


దరఖాస్తుల ఆహ్వానం

కాశిబుగ్గ సెంటర్: జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట, నెక్కొండ వరంగల్‌లో ఉన్న భవిత కేంద్రాల్లో దివ్యాంగ విద్యార్థులకు స్పీచ్ థెరపీ సేవలు అందించేందుకు తాత్కాలిక ప్రాతిపదికన అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వాసంతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి స్పీచ్ థెరపీ క్యాంపునకు రూ.1000 గౌరవేతనం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు దరఖాస్తులను ఈనెల 23లోపు డీఈఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

లైన్‌తండాకు నీటిని సరఫరా చేయాలి

నర్సంపేట రూరల్: ఇప్పల్‌తండా గ్రామ శివారులోని లైన్ తండాకు తాగునీటి సమస్య ఉందని, నీటిని సరఫరా చేయాలని కోరుతూ నర్సంపేట–మల్లంపల్లి 365 జాతీయ రహదారిపై స్థానికులు మంగళవారం ధర్నాచేశారు. గతంలో ఆకులతండా, లైన్‌తండాకు నీటి విషయంలో గొడవ జరిగింది. బావి విషయమై రెండు గ్రామాల ప్రజలు కోర్టును ఆశ్రయించడంతో సమస్య ఇంకా కొలిక్కి రాలేదు. దీంతో లైన్ తండావాసులు నీటికి ఇబ్బంది పడుతున్నారు. ధర్నా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పారు. అనంతరం మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడి నీళ్లు ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సుమలతకు జాతీయ పురస్కారం



దుగ్గొండి: మండలంలోని నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వెల్లండి సుమలత విశిష్ట విద్యా సేవారత్న జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈమేరకు తొలివెలుగు సాహితీవేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభలో సోమవారం ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. 30 సంవత్సరాలుగా సైన్స్‌ను సాహిత్యంతో మేళవింపు చేస్తూ సుమలత విద్యాబోధన చేస్తున్నారు. ఈమేరకు సుమలతను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, మాధవి, సుధీర్‌కుమార్, కరంచంద్, వెంకట్రావు, కమల, నాగరాజు, ప్రదీప్‌కుమార్, అనురాధ అభినందించారు.

మహిళా బిల్లులో రిజర్వేషన్లు కల్పించాలి

నర్సంపేట: మహిళా రిజర్వేషన్ బిల్లులో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ నియోజకవర్గ కన్వీనర్ వంగాల రాగసుధ డిమాండ్ చేశారు. పట్టణంలో మంగళవారం ఆమె మాట్లాడారు. 33 శాతం మహిళా రిజర్వేషన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు లేకపోతే న్యాయం జరుగదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుతో పాటు చట్ట సభల్లో ప్రత్యేక బీసీ రిజర్వేషన్ బిల్లు వెంటనే తీసుకురావాలని, అందుకోసం కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

మహా గణపతిం భజే..

వాడవాడలా కొలువుదీరిన గణనాథుడు

- ప్రత్యేక పూజలందుకుంటున్న ఆది దేవుడు
- ఆకట్టుకుంటున్న హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లోని చంద్రయాన్–3 గణపతి మండపం సెట్టింగ్

గణపతి నవరాత్రి ఉత్సవాలు జిల్లాలో సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వరంగల్ నగరంతోపాటు వర్ధన్నపేట, నర్సంపేట మున్సిపాలిటీలు, గ్రామాల్లో గణనాథుడు కొలువుదీరాడు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ఆది దేవుడు భక్తులతో పూజలందుకుంటున్నాడు. సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహిస్తున్నారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్‌లోని హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్ (గేటెడ్ హోల్‌సేల్ మార్కెట్)లో వేసిన చంద్రయాన్–3 గణపతి మండపం సెట్టింగ్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. విగ్రహం చుట్టూ గోడలకు గ్రహాలు, నక్షత్రాల ఆర్ట్ వేసి విశ్వంలో విహరిస్తున్నట్లు అనుభూతి కలిగించే విధంగా రూపొందించారు.

– సాక్షి, నెట్‌వర్క్





హోల్‌సేల్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో చంద్రయాన్ -3 మండపం సెట్టింగ్ (ఇన్‌సెట్‌లో) గీసుకొండ కొలువుదీరిన కల్లుగీత గణనాథుడు



వరంగల్‌లో దాల్చిన చెక్క, డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసిన గణపతి ప్రతిమ

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- మేయర్ గుండు సుధారాణి



మాట్లాడుతున్న నగర మేయర్ సుధారాణి

వరంగల్ అర్బన్: నగర పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి ఆదేశించారు. మంగళవారం వరంగల్ బల్దియా ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో గ్రేటర్ పరిధిలోని పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలో వివిధ పథకాల కింద కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆయా నియోజకవర్గాల పరిధిలో పట్టణ ప్రగతి, ముఖ్యమంత్రి హామీ నిధులు (సీఎంఏ), స్మార్ట్ సిటీ పథకంతో కొనసాగుతున్న అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

గడప గడపకూ..

6 స్కీంల గ్యారంటీ కార్డు

- ఇంటింటా అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు
- అధికారంలోకి వస్తే అమలు చేస్తామని హామీ
- నియోజకవర్గానికో ఏఐసీసీ నాయకుడికి బాధ్యతలు



వరంగల్‌లో గ్యారంటీ కార్డును అందిస్తున్న కేంద్ర మాజీ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్, మాజీ మంత్రి కొండా సురేఖ

సాక్షి, వరంగల్: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా యూపీఏ అధ్యక్షురాలు, కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ ప్రకటించిన 6 స్కీంల గ్యారంటీ కార్డును జనంలోకి తీసుకెళ్లేందుకు పార్టీ రంగంలోకి దిగింది. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో ఆదివారం జరిగిన విజయభేరి సభావేదికలో ప్రకటించిన ఈ కార్డును గడపగడపకూ చేర్చే కార్యక్రమాన్ని జిల్లాలో సోమవారమే ప్రారంభించారు. మంగళవారం కూడా వివిధ ప్రాంతాల్లో అందజేశారు. అధికారంలోకి రాగానే తప్పనిసరిగా ఆరు హామీలను నెరవేరుస్తామని, అందుకు సంబంధించి పీసీసీ అధ్యక్షుడు, సీఎల్పీ నేత సంతకాలతో కూడిన గ్యారంటీ కార్డులను ఇంటింటా పంపిణీ చేస్తూ ప్రజలకు వివరిస్తున్నారు. ఇందుకోసం నియోజకవర్గానికో ఏఐసీసీ నేతకు బాధ్యతలు అప్పగించారు.

- పరకాల నియోజకవర్గం సంగెం మండలంలోని గవిచర్ల గ్రామంలో చండీఘర్ పీసీసీ అధ్యక్షుడు హర్మోహిందర్ సింగ్ లక్కీ, ఎర్రబెల్లి స్వర్ణ, వెంట్రామిరెడ్డి గ్యారంటీ కార్డుల పంపిణీని సోమవారం ప్రారంభించారు.
- హసన్‌పర్తి మండల కేంద్రంలో ఏఐసీసీ సెక్రటరీ రోహిత్ చౌదరి ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నమిండ్ల శ్రీనివాస్ గ్యారంటీ కార్డులను పంపిణీ చేశారు.
- నర్సంపేట నియోజకవర్గం దుగ్గొండి మండలంలోని గిర్నిబావిలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొంతి మాధవరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు కార్డుల పంపిణీని ప్రారంభించారు.

కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ: చండీఘర్ పీసీసీ అధ్యక్షుడు హర్మోహిందసింగ్ లక్కీ



సంగెం: గవిచర్లలో గ్యారంటీ కార్డు అందజేస్తున్న లక్కీ, ఇనుగాల తదితరులు

సంగెం: కాంగ్రెస్‌తోనే బంగారు తెలంగాణ సాధ్యమవుతుందని చండీఘర్ పీసీసీ అధ్యక్షుడు హర్మోహిందసింగ్ లక్కీ స్పష్టం చేశారు. సోమవారం గవిచర్లలో కాంగ్రెస్ గ్యారంటీ స్కీం కార్డులను ఇంటింటికీ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగానే 6 గ్యారంటీ స్కీంలను అమలు చేసి తీరుతామన్నారు. కేసీఆర్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించారని, ప్రజల కష్టార్జితాన్ని దోచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ సెంటి మెంట్‌తో మోదీ, కేసీఆర్ లాభం పొందాలని చూస్తున్నారని ఈ సారి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, పరకాల ఇన్‌చార్జ్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు సంధ్యారాణి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు కవిత, ఎంపీటీసీ సంపత్‌రెడ్డి, రవికుమార్, నాయకులు రమేష్, కేశవులు నాగరాజు, నవీన్‌రెడ్డి, సదయ్య పాల్గొన్నారు.

ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లండి : సల్మాన్‌ఖుర్షీద్

విజయభేరి సభలో సోనియాగాంధీ ఆదివారం ప్రకటించిన 6 స్కీంల గ్యారంటీ కార్డులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని కేంద్ర మాజీ మంత్రి, సీడబ్ల్యూసీ మెంబర్ సల్మాన్‌ఖుర్షీద్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాజీ మంత్రి కొండా సురేఖతో కలిసి మంగళవారం కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రగతి కోసం, ప్రజల భవిత కోసం కాంగ్రెస్ ఇచ్చే హామీలతో కూడిన అభయ హస్తం గ్యారంటీ కార్డు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 7286855555 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.



మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి



కాపులకనిపర్తిలో మహిళలకు కుట్టుమిషన్లు అందజేసిన డీఆర్డీఓ సంపత్‌రావు

సంగెం: మహిళలు వ్యవసాయానికి అనుబంధంగా కుటీర పరిశ్రమలు, కుట్టుమిషన్లతో ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్డీఓ సంపత్‌రావు అన్నారు. కాపులకనిపర్తిలో సెర్ప్ సౌజన్యంతో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో 25 మందికి మూడు నెలల ఉచిత కుట్టు శిక్షణ ఇచ్చారు. 17 మంది మహిళలకు మంగళవారం కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన మహిళలకు టెక్స్‌టైల్ పార్కులో ఉపాధి కల్పనకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు చందర్‌రావు, సర్ఫరాజొద్దీన్, వినోద్ ఆనంద్, రమేష్‌బాబు, ఏపీఎం కిషన్, సీసీలు సురేష్, స్వరూపారాణి, రాజయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఈజీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఓ సంపత్‌రావు అన్నారు. మంగళవారం ఆశాలపల్లిలో ఈజీఎస్ సామాజిక తనిఖీ గ్రామ సభకు హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిశోర్‌యాదవ్, పంచాయతీ కార్యదర్శి సోనబోయిన కిరణ్, డీఆర్పీ సునీత తదితరులు పాల్గొన్నారు.

బీసీని ముఖ్యమంత్రిగా ప్రకటించాలి

- సాధన సదస్సులో వక్తలు

హన్మకొండ: జనాభాలో సగభాగానికి పైగా ఉన్న బీసీలకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలో ఒక్కసారి కూడా ముఖ్యమంత్రిగా అవకాశం దక్కలేదని, ఈసారైనా కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. మంగళవారం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో తెలంగాణలో సామాజిక న్యాయం – బీసీ ముఖ్యమంత్రి సాధన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆయా పార్టీల, సంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా తెలంగాణలో సామాజిక న్యాయం – బీసీ ముఖ్యమంత్రి సాధన సమితి చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గాలి వినోద్ కుమార్ మాట్లాడుతూ రాజ్యాధికారం ద్వారానే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ దిశగా 2023లో జరిగే తెలంగాణ రాష్ట్ర ఎన్నికల్లో అన్ని పార్టీలు బీసీ ముఖ్యమంత్రి చేయడానికి తమ రాజకీయ ఎజెండాను రూపొందించాలని డిమాండ్ చేశారు. ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కత్తి వెంకటస్వామిగౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో ధనం, కులం రెండింటికీ ప్రాధాన్యం ఉందని, బీసీలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడంలో విఫలమైన మాట వాస్తవమేనన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలి

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి కె.చందన్‌కుమార్



ఈ-కేవైసీపై అవగాహన కల్పిస్తున్న డీఎస్‌ఓ కె.చందన్‌కుమార్

ఖిలా వరంగల్: జిల్లాలోని రేషన్ షాపుల్లో రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.చందన్‌కుమార్ సూచించారు. ఈమేరకు మంగళవారం జిల్లా పౌర సరఫరాల శాఖ కార్యాలయంలో ఈ-పాస్ టెక్నీషియన్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు రేషన్ షాపుల్లో డీలర్లు కార్డుదారులకు తప్పనిసరిగా ఈ-కేవైసీ అప్‌డేట్ చేయించాలని ఆదేశించారు. ముందుగా రేషన్ తీసుకెళ్లేందుకు వచ్చిన కార్డుదారుడికి ఈ-కేవైసీ చేయాలని, అనంతరం కార్డుదారుల కుటుంబ సభ్యులకు చేయాలని రేషన్ డీలర్లకు సూచించారు. రాష్ట్రంలో ఎక్కడైనా రేషన్ దుకాణాల్లో ఈ-కేవైసీ చేసుకోవచ్చని, కార్డుదారులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అలాగే, ఈ-కేవైసీ నమోదు ప్రచారంలో భాగంగా వరంగల్ రామన్నపేటలోని 71వ షాపును డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, మండల అధికారులతో కలిసి డీఎస్‌ఓ సందర్శించారు. ఈ-కేవైసీ ఎలా చేయాలో డీలర్‌కు అవగాహన కల్పించారు. ఉపయోగాలు కార్డుదారులకు వివరించారు. కార్యక్రమంలో డీలర్ చంద్రమౌళి, కార్డుదారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు స్వామి

చెన్నారావుపేట: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు నమిండ్ల చిన్న స్వామి డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని కేంద్రమంత్రి నారాయణ పార్లమెంట్‌లో మాట్లాడటం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపిస్తే కేంద్రం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. మండల అధ్యక్షుడు ఆకులపల్లి ఉప్పలయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు బర్ల స్వామి, మహిళా అధ్యక్షురాలు మాదాసి లత, పైస రజిత, యాదయ్య, జనార్దన్ ఉన్నారు.

ఎమ్మార్పీకే ఎరువులు విక్రయించాలి

- కలెక్టర్ ప్రావీణ్య



వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని షాపులో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

ఖిలా వరంగల్: ఎమ్మార్పీకే ఈపాస్ ద్వారా ఎరువులు విక్రయించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యాపారులను హెచ్చరించారు. ఖిలా వరంగల్ మండల పరిధిలోని పీఏసీఎస్, ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్, సీడ్స్ షాపులను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉషాదయాళ్‌తో కలిసి మంగళవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని ఎరువులు, క్రిమిసంహారక మందుల నిల్వ రిజిస్టర్లు, రైతులకు విక్రయిస్తున్న తీరును ఆమె పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని వివరించారు. ఎరువులు, పురుగు మందులు ఎమ్మార్పీకి మించి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట మండల వ్యవసాయాధికారి విజ్ఞాన్, ఏఈఓలు చంద్రకాంత్, సొసైటీ అధ్యక్షుడు కేడల జనార్దన్ ఉన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ, దేశభక్తి



మామునూరు : ఉత్తమ ఎన్‌సీసీ కేడెట్లతో కలెక్టర్

మామునూరు: దేశానికి యువతే బలమని, ఎన్‌సీసీ శిక్షణ పొందిన కేడెట్లకు ఏ, బీ, సీ సర్టిఫికెట్లతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రమశిక్షణ, సామాజిక సేవ, దేశభక్తి మరింత పెంపొందుతుందని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మామునూరులోని పీటీసీ ప్రాంగణంలో ఎన్‌సీసీ 10వ బెటాలియన్ వరంగల్ క్యాంపు కమాండెంట్ కల్నల్ అజయ్‌నంద కందూరి, గ్రూప్ కమాండెంట్ కల్నల్ సచిన్ నింబాల్కర్ వీరచక్ర పర్యవేక్షణలో ప్రారంభమైన ఎన్‌సీసీ శిక్షణ క్యాంపు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా కలెక్టర్ ప్రావీణ్య హాజరై మాట్లాడారు. దేశ సేవకు ఎన్‌సీసీ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందన్నారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్లు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలను పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజతో కలిసి తిలకించారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, కెప్టెన్ సతీష్‌కుమార్, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీలత, ఓంకార్, బాలరెడ్డి, వాసు, భవాని, గాయిత్ర సువాస్, నారాయణరెడ్డి, శ్రీనివాస్, సతీష్‌గౌడ్, కవిత, పుత్లీబాయి, కుమారస్వామి, 500 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

ముగిసిన ఓటరు నమోదు

ఖిలా వరంగల్: జిల్లాలో ఓటరు నమోదు కార్యక్రమం మంగళవారం ముగిసిందని కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. నమోదు చేసిన ఓటరు జాబితా సంబంధిత పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాలు, కలెక్టర్ కార్యాలయంలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు. జాబితాలో పేరు లేని వారు సంబంధిత దరఖాస్తులను నింపి బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమం ముగిసినా అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు కూడా ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. యువత నిర్భయంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి



మధు (ఫైల్)

పర్వతగిరి: మెదక్ జిల్లా తూప్రాన్‌లో పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన యువకుడు ఆడెపు మధు (33) మంగళవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పర్వతగిరిలో వంటమనిషిగా పనిచేసే ఆయన కొద్ది రోజులుగా తూప్రాన్‌లోని ఫాంహౌస్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో మధు పని చేసే యజమానికి భూమికి సంబంధించిన వివాదం ఉంది. యజమానికి మద్దతుగా ఉన్నందున ఎదుటి వారు అతడిపై దాడి చేసి చంపినట్లు సమాచారం. కాగా, ఒక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

క్లుప్తంగా

కేయూకు ముగిసిన సెలవులు..

● బకాయిలు చెల్లిస్తేనే మెస్ కార్డుల రెన్యూవల్
● ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు హాస్టల్ వసతి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి ఈనెల 18వ తేదీతో సెలవులు ముగిశాయి. మంగళవారం నుంచి తరగతుల ప్రారంభమయ్యాయి. హాస్టల్ వసతితోపాటు మెస్‌కార్డులు రెన్యూవల్ చేస్తున్నారు. గత విద్యాసంవత్సరంలో హాస్టల్‌వసతి, మెస్‌కార్డులు కలిగిన విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు పోనూ మిగతా మెస్ బిల్లుల బకాయిలు చెల్లిస్తేనే మెస్‌కార్డులు జారీ చేస్తున్నట్లు కేయూ హాస్టళ్ల డైరెక్టర్ వెంకయ్య తెలిపారు. పీజీ కోర్సుల రెండో సెమిస్టర్ పూర్తిచేసుకున్న మూడోసెమిస్టర్ల విద్యార్థులకు రెగ్యులర్ కోర్సులతోపాటు, ఎస్ఎఫ్‌సీ విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి కల్పించనున్నారు. మంగళవారం వరకు మెస్‌లను రీఓపెన్ చేయలేదు. కనీసం వందం మంది విద్యార్థులు కార్డులు తీసుకుంటే మెస్ ఓపెన్ చేస్తామని డైరెక్టర్ తెలిపారు. బీ ఫార్మసీ మొదటి సంవత్సరంలో ఇటీవల చేరిన విద్యార్థులకు కూడా హాస్టల్ వసతి మెస్‌కార్డులు జారీచేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాస్(ఫైల్)

జనగామ రూరల్: పని ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్న ఓ వ్యక్తి వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన సోమవారం రాత్రి శామీర్‌పేట– వడ్లకొండ శివారులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని వడ్లకొండ గ్రామానికి చెందిన కొర్నె పాక శ్రీనివాస్ (43) జనగామలో ఓ హోటల్‌లో పని ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై వడ్లకొండ బైపాస్ నుంచి వెళ్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీకొనడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరకుని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. కాగా, మృతుడికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రైతు..


వీరన్న మృతదేహం

బయ్యారం: విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందారు. ఈ ఘటన సోమవారం మండలంలోని నాగారం తండాలో జరిగింది. తండాకు చెందిన అజ్మీరా వీరన్న (27) తన మిర్చితోటలో దమ్ము చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో వీరన్న ఎత్తుకొస్తున్న ఇనుపగొర్రు.. తోటలో ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్ట్‌గా వేసిన వైరుకు తగిలింది. దీంతో విద్యుత్ సరఫరా అయి వీరన్న అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య లలిత, ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై ఉపేందర్ తెలిపారు. కాగా, వీరన్న మృతితో పండుగ (వినాయకచవితి) రోజు తండాలో విషాదం నెలకొంది.

మాట నిలబెట్టుకున్న సోనియాగాంధీ..

● సీడబ్ల్యూసీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్


మాట్లాడుతున్న సల్మాన్ ఖుర్షీద్. పక్కన హనుమకొండ, వరంగల్ డీసీసీ అధ్యక్షులు రాజేందర్‌రెడ్డి, స్వర్ణ

హన్మకొండ చౌరస్తా: సోనియాగాంధీ.. తెలంగాణ ప్రజల ఆకాంక్ష అర్థం చేసుకుని రాష్ట్రం ఇచ్చి తన మాట నిలబెట్టుకున్నారని సీడబ్ల్యూసీ సభ్యుడు సల్మాన్ ఖుర్షీద్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ అభ్యున్నతికి ఆరు గ్యారంటీలను పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను పార్టీ శ్రేణులు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే వంచించిందని, బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను మోసం చేశాయని మండిపడ్డారు. బీజేపీ.. సీబీఐ, సీఐడీ, ఈడీ, ఇన్‌కమ్ ట్యాక్స్‌ల పేరుతో ప్రతిపక్షాల గొంతులు నొక్కుతుందని ధ్వజమెత్తారు. ప్రజలు ప్రేమ, ఐకమత్యంతో ఉండాలని రాహుల్‌గాంధీ 'భారత్ జోడో' యాత్ర చేపడితే కుల, మత విద్వేషాలు రెచ్చగొట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేస్తోందన్నారు. ఇండియా కూటమితో ప్రధానికి మోదీకి ఓటమి భయం పట్టుకుందని, అందుకే భారత్‌గా పేరు మారుస్తానని అంటున్నారని విరుచుకుపడ్డారు. ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి మాట్లాడుతూ రాహుల్‌గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌తో తెలంగాణలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరితే, కాంగ్రెస్ విజయభేరితో మరింత జోష్ పెరిగిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చూడాలనే సోనియాగాంధీ కల నెరవేరబోతుందన్నారు. అందుకు నాయకులు, కార్యకర్తలు అహర్నిషలు కృషి చేయాలన్నారు. తెలంగాణలో బడుగు, బలహీన వర్గాల యువకుల ఆశలు గల్లంతయ్యాయని , కేసీఆర్ కుటుంబం మాత్రం బాగుపడిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒక్కటేనని, బయట తిట్టుకుంటూ లోపల కలిసి ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకుడు రవీంద్ర ఉత్తమ్ రావు దళ్వి, పంజాబ్ పీసీసీ చీఫ్ లక్కీ, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు బండ్రు శోభారాణి, హనుమకొండ, వరంగల్ డీసీసీ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, నాయకులు అజ్మతుల్లా, డాక్టర్ రియాజ్, సాంబయ్య, శ్రీనివాసరావు, ఇనుగాల వెంకట్రాంరెడ్డి, నమిండ్ల శ్రీనివాస్, కత్తి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ డబ్బు జమచేయాలి


బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

● పలువురి రైతుల డిమాండ్
● మల్కాపూర్‌లో బ్యాంకు ఎదుట ధర్నా

చిల్పూరు: రుణమాఫీ పథకంలో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన డబ్బు వెనకకు పోయిందంటూ బ్యాంకు అధికారులు చెబుతున్నారని, వాటిని వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలంటూ పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని ఇండియన్ బ్యాంకు ఎదుట దాదాపు మూడు వందల మంది రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు వెన్నం మాధవరెడ్డి, కాండూరి రంగరాజు, కొయ్యడ రాందాసు, బిల్ల రాజు, చింతల రాయుడు, కేశిరెడ్డి రాజు, రాజభూపతిలు, మాదిరెడ్డి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ 2018 సంవత్సరంలో బ్యాంకుల్లో తీసుకున్న రైతు రుణాలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. దీనిపై తమకు ఫోన్ మెసేజ్‌లు వచ్చాయన్నారు. తీరా బ్యాంకుకు వస్తే అకౌంట్‌లో డబ్బులు లేవంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వం, బ్యాంకు అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కాగా, బ్యాంకు అధికారులు స్పందించకపోవడంతో రైతులు అసహనంతో తలుపులు మూశారు. దీంతో మేనేజర్ సురేష్‌బాబు బయటకు రాగా వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ సురేష్‌బాబు వివరణ ఇస్తూ రైతులకు చెందిన బ్యాంకు అకౌంట్లు ఫ్రీజ్ కావడం, క్లోజ్ కావడం, ఖాతాదారులు డిఫాల్టర్లుగా మారడం, పాత ఖాతాల వివరాలే వ్యవసాయ శాఖ వద్ద ఉండడంతో ఈ సమస్య ఏర్పడిందన్నారు. బ్యాంకులో మొత్తం 3509 మంది రైతులకు గాను 1100 మందికి రుణమాఫీ అయినట్లు మెసేజ్ వచ్చిందని, అందులో కేవలం 237 మందికి వర్తించిందన్నారు. ఇందులో తమ తప్పిదం లేదని, త్వరలో రైతుబంధు ద్వారా వీరికి న్యాయం జరుగుతుందన్నారు.

26 నుంచి ఎంబీఏ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఎంబీఏ రెండో సెమిస్టర్ ఈనెల 26 నుంచి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక మంగళవారం తెలిపారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 26, 29 తేదీల్లో, అక్టోబర్3న, 5, 10, 12వ తేదీల్లో నిర్వహించనున్నామని తెలిపారు. నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 25, 27, 30వ తేదీల్లో, అక్టోబర్4, 6న, 9న,11వ తేదీల్లో జరుగుతాయని తెలిపారు.

23 నుంచి ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎంపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షల టైంటేబుల్‌ను మంగళవారం పరీక్షల విభాగం అధికారులు విడుదల చేశారు. ఈనెల 23, 25, 27 తేదీల్లో నిర్వహిస్తారని తెలిపారు. అలాగే, బీపీఈడీ నాలుగో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 23, 25, 27, 29 తేదీల్లో నిర్వహిస్తారు. పూర్తి వివరాలు కేయూ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు.

బీసీలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

● బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్


నినాదాలు చేస్తున్న బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు సురేష్, నాయకులు

హన్మకొండ: బీసీ వర్గాలకు చట్ట సభల్లో రిజర్వేషన్లు కల్పించిన అనంతరమే మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ రాజ్యాధికార ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర కేబినెట్ మహిళా రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం తెలిపి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. బీసీ వర్గాలు, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సీఎం కేసీఆర్.. ప్రధానికి లేఖ రాయడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. కేసీఆర్ తాను ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో బీసీ వర్గాల్లో మహిళా కోటా అమలు చేయకపోవడం వెనుక మతలబేమిటని ప్రశ్నించారు. కేసీఆర్ వెంటనే తాను ప్రకటించిన 115 మంది అభ్యర్థుల జాబితాలో ముందు బీసీ వర్గాల మహిళలకు 33 శాతం టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజికంగా ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల తర్వాత బీసీ వర్గాలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే వర్టికల్ పద్ధతిలో అన్ని విభాగాల్లో మహిళా రిజర్వేషన్లు అమలు జరగాలన్నారు. అలా కాకుండా కేవలం మహిళా రేజర్వేషన్లను మాత్రమే అమలుపరిస్తే అది రిజర్వేషన్ల మౌలిక సూత్రానికి విరుద్ధమన్నారు. సమావేశంలో భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జ్ చేపూరు ఓదెలు యాదవ్, నాయకులు పొదిలి రాజు, సాయిబాబా, దామరకొండ కొమురయ్య, మడత కిశోర్, చింతం అనిల్, వనం మహేందర్, పైండ్ల భిక్షపతి , గాజు యుగంధర్ యాదవ్, కూరపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు

వీసీ, రిజిస్ట్రార్ల చిత్రపటాలకు పిండప్రదానం

● కేయూలో కొనసాగుతున్న విద్యార్థి జేఏసీ దీక్షలు


వీసీ, రిజిస్ట్రార్ల చిత్రపటాలకు పిండ ప్రదానం చేస్తున్న విద్యార్థులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ అడ్మిషన్లకు సంబంధించిన రెండో జాబితా విడుదల చేయాలని, ఈ అడ్మిషన్లలో జరిగిన అవకతవకలపై న్యాయ విచారణ జరిపించాలనే తదితర డిమాండ్లతో 14 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా వీసీ, రిజిస్ట్రార్లు స్పందించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం దీక్షల శిబిరం వద్ద వారి చిత్రపటాలకు విద్యార్థి జేఏసీ నాయకులు పిండ ప్రదానం చేసి నిరసన తెలిపారు. వంటవార్పు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీసులతో కొట్టించడాన్ని నిరసిస్తూ 14 రోజుల నుంచి దీక్షలు చేస్తున్నా వీసీ, రిజిస్ట్రార్లు స్పందించడం లేదని మండిపడ్డారు. కాగా, మంగళవారం విద్యార్థి జేఏసీ దీక్షలను పార్ట్‌టైం లెక్చరర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సాల్లికిరణ్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ చైర్మన్ తిరుపతియాదవ్, నేతలు గుగులోత్ రాజునాయక్, మేడరంజిత్‌కుమార్, బొట్లమనోహర్, ఆరెగంటి నాగరాజు, మాచర్ల రాంబాబు, అంబాలకిరణ్, మట్టెడ కుమార్, శంకర్, విజయ్‌కన్నా, మొగిలివెంకటరెడ్డి, ఎండీ పాషా, నిమ్మల రాజేష్, బానోత్ లక్‌పతి, గట్టు ప్రశాంత్, కాయిత నాగరాజు, మంగొపెల్లి హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాలు పారదర్శకం

● అన్ని విభాగాల డీన్ల వెల్లడి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ రెండో కేటగిరీ ప్రవేశాలు పారదర్శకంగా నిర్వహించామని, ప్రవేశ పరీక్షల ఫలితాలు కూడా వెల్లడించి కేయూ వెబ్‌సైట్‌లోనే అప్‌లోడ్ చేశామని ఆర్ట్స్, సైన్స్, సోషల్‌సైన్స్, లా, విద్య, ఇంజనీరింగ్, లా, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫార్మసీ విభాగాల డీన్‌లు బన్నఅయిలయ్య, మనోహర్, విజయలక్ష్మి, మల్లారెడ్డి, రాంనాథ్‌కిషన్, శ్రీనివాసులు, అమరవేణి, నర్సింహారెడ్డి మంగళవారం రాత్రి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. పీహెచ్‌డీ రెండో కేటగిరీలో అడ్మిషన్లు నిష్పక్షపాతంగా చేశామన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఉంటే విజ్ఞాపన పత్రంతో డీన్లకు సమర్పించాలన్నారు. ఎక్కడైనా తప్పుదొర్లితే ఆ తప్పును సవరించేందుకు డీన్ల వద్ద ఉన్న సమాచారాన్ని పునఃపరిశీలించి పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. పీహెచ్‌డీ రెండో కేటగిరీ అడ్మిషన్లపై కొద్దిరోజులుగా కొంతమంది సీటు రాని విద్యార్థి నాయకులు ఆందోళనలు చేయడం, అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, డీన్ పదవికి రాజీనామ చేయాలని ఫోన్ల ద్వారా అధికారులను భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. యూనివర్సిటీ ఆస్తులు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. విద్యార్థి నాయకుల చేష్టలను ముక్తకంఠంతో ఖండిస్తున్నామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో విద్యా వాతావరణాన్ని దెబ్బతీస్తున్న వారికి మద్దతు ఇవ్వడం శోచనీయమన్నారు.

భూ తగాదాలు.. ఒకరి హత్య

● భార్య, కుమారుడి పరిస్థితి విషమం
● పోలీసుల అదుపులో నిందితులు
● కాళేశ్వరంలో ఘటన


మల్లేష్(ఫైల్)

కాళేశ్వరం: పదిహేను సంవత్సరాల నుంచి వారసత్వ భూమి, ఉద్యోగ గొడవలతో రెండు కుటుంబాలు పగతో రగిలిపోతున్నాయి. ఈ క్రమంలో ఓ కుటుంబంపై మరో కుటుంబం దాడికి పాల్పడింది. ఈ ఘటనలో ఒకరు హత్యకు గురి కాగా, భార్య, కుమారుడి పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం కాళేశ్వరం గ్రామానికి చెందిన పత్తి మల్లేష్(55) రెవెన్యూశాఖలో వీఆర్‌ఏగా పని చేసి ఇటీవల ఇరిగేషన్ శాఖలోని మిషన్ భగీరథలో పంపు ఆపరేటర్‌గా నియమితులయ్యారు. మల్లేష్ అన్న రాములు చనిపోగా, అల్లుడు, వదినతో తరచూ భూములు, వీఆర్‌ఏ వారసత్వ ఉద్యోగం కోసం గొడవలు జరిగేవి. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం వారి ఇద్దరికి చెందిన స్థానిక సబ్‌స్టేషన్ సమీపంలోని భూమిని అన్న అల్లుడు నార ఈశ్వర్ చదును చేయించాడు. అక్కడి వెళ్లి మల్లేష్ గొడవకు దిగి నిలిపివేశాడు. దీంతో ఆగ్రహం చెందిన అల్లుడు ఈశ్వర్, అతని అత్త వెంకటమ్మ, కుమారుడు తిరుమల్ కలిసి సోమవారం ఉదయం మల్లేష్ ఇంటి వద్దకు వచ్చి కర్రలు, రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో మల్లేష్, అతని భార్య పోసక్క, కుమారుడు హరీశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణ్‌రావు, సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని వెంటనే క్షతగాత్రులను మహాదేవపూర్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మల్లేష్ మృతి చెందాడు. మంగళవారం గ్రామంలో దహన సంస్కారాలు నిర్వహించారు. మృతుడి భార్య స్పృహ కోల్పోగా, కుమారుడి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. దీంతో గ్రామంలో పండుగ పూట విషాదఛాయలు అలుముకున్నాయి. దాడికి పాల్పడిన ముగ్గురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నారు. ఈ ఘటనపై మృతుడి బావమరిది లింగయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో యువకుడి బలవన్మరణం..

● అలిగేటిలో దూకి ఆత్మహత్య
● మృతదేహం లభ్యం


రమేష్(ఫైల్)

బయ్యారం: ఒక వైపు ప్రేమలో మోసపోయి.. మరో వైపు అదే యువతి తరుపు వారు పెట్టిన కేసుకు మనస్తాపం చెందిన ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. ఈ ఘటన బయ్యారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన బొలగాని రమేష్(30) హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ ప్రాంతంలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఓ యువతిని ప్రేమించగా ఆమె తరుపు వారితో జరిగిన వివాదంలో రమేష్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదైంది. కేసు నమోదైన తరువాత రమేష్.. తన చెల్లి జ్యోతికి పాముకాటు వేయటంతో ఆగస్టు 7న ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం పేరేపల్లికి వచ్చి అక్కడే ఉంటున్నాడు. ఈ సమయంలో తన ప్రేమ విఫలం కావడంతో పాటు కేసు నమోదైన విషయంపై తరుచూ బాధపడేవాడని మృతుడి బంధువులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం పేరేపల్లి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరిన రమేష్.. బయ్యారం సమీపంలోని అలిగేటిలో దూకాడు. సోమవారం ఏటిలో రమేష్ మృతదేహం లభ్యమైంది. దీంతో మృతుడి సోదరి జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

కిడ్నీ నొప్పి భరించలేక మహిళ..

నల్లబెల్లి: కిడ్నీ నొప్పి, ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని బోల్లోనిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రాగుల లావణ్య(30) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల చుట్టు తిరిగినా నయం కాలేదు. మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురుకావడంతో మనస్తాపానికి గురైన లావణ్య.. సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషగులికలు మింగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబీకులు ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త రాజు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతురాలి తండ్రి నాగెల్లి రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నైనాల నగేష్ తెలిపారు.

చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠా అరెస్ట్

● మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్ చంద్ర

భువనగిరి : చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన ముఠాను భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. మంగళవారం తన కార్యాలయంలో భువనగిరి డీసీపీ రాజేష్‌చంద్ర నిందితులను మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. వరంగల్ జిల్లాకు చెందిన బోగి గణేష్, వరంగంటి నవీన్, దేవర రమేష్, బోగి నరేష్ ఫైనాన్స్ వ్యాపారం చేసేవారు. వ్యాపారంలో నష్టం రావడంతో హైదరాబాద్‌కు వెళ్లి ఏదో ఒక పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వచ్చే డబ్బుతో అవసరాలు తీరకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 2వ తేదీన నలుగురు లాంగ్ డ్రైవ్ యాప్‌లో నంబర్‌లేని కారును బుక్ చేసుకున్నారు. ఆ కారులో హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తూ మార్గమధ్యలో ముందుగా వెళ్తున్న కారు నంబర్‌ను నోట్ చేసుకున్నారు. అనంతరం ఆ నంబర్ గల ప్లేట్‌ను తయారు చేయించుకుని తమ అద్దెకారుకు ఏర్పాటు చేసుకున్నారు. 3వ తేదీన ఉదయం 5గంటలకు వరంగల్ నుంచి జఫర్‌గఢ్, తిరుమలగిరి మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరారు. వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ శివారుకు చేరుకోగానే రోడ్డు మీదుగా ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న మహిళను బెదిరించి మెడలో ఉన్న మూడున్నర తులాల బంగారు పుస్తెల తాడు తీసుకుని, వాటికి ఉన్న రెండు పుస్తెలను ఆమెకి ఇచ్చి అక్కడి నుంచి పారిపోయారు. బాధిత మహిళ వలిగొండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ముఠా సభ్యులు మంగళవారం ఉదయం 5 గంటల సమయంలో చైన్ స్నాచింగ్ పాల్పడేందుకు మేడిపల్లిలోని లాంగ్‌డ్రైవ్ సెంటర్‌కి వెళ్లి కారు అద్దెకు తీసుకున్నారు. చిట్యాలకు వెళ్తుండగా వలిగొండ మండలం నాగారం గ్రామం వద్ద పోలీసుల వాహనాల తనిఖీలో అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి 33గ్రాముల పుస్తెలతాడు, 5 మొబైల్ ఫోన్లు, కారు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, వలిగొండ ఎస్సై ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజక్షన్ వికటించి.. రిటైర్డ్ కానిస్టేబుల్ మృతి

● పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు.. కేసు నమోదు
● డిప్యూటీ డీఎంహెచ్ఓ విచారణ
● ఆస్పత్రిలో కాలం చెల్లిన మందులు, ఇంజక్షన్లు
● నిబంధనలకు విరుద్ధంగా నిర్వహణ


సారయ్య (ఫైల్)


విచారణ చేపడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

హసన్‌పర్తి: ఇంజక్షన్ వికటించి ఓ రిటైర్డ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ ఘటన హసన్‌పర్తి మండల కేంద్రంలో జరిగింది. చింతగట్టుకు చెందిన రిటైర్డ్ కానిస్టేబుల్ నద్దునూరి సారయ్య (65) చికిత్స నిమిత్తం సోమవారం మండల కేంద్రంలోని 'శంకర్' ఆస్పత్రికి వచ్చారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్.. సారయ్యకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం రెండు ఇంజక్షన్లు ఇవ్వగా సారయ్య ఒకసారిగా కుప్పకూలారు. దీంతో సారయ్యను 108లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

ప్రిస్కిప్షన్ ఇవ్వమని..

ఇదిలా ఉండగా సారయ్యకు ప్రథమ చికిత్స సందర్భంగా ఉపయోగించిన మందుల ప్రిస్కిప్షన్ ఇవ్వాలని 108 సిబ్బంది.. వైద్యుడి శంకర్‌ను కోరారు. అయితే అప్పటికే అక్కడికి చేరుకున్న మృతుడి కుమారులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ డాక్టర్ శంకర్‌పై దాడికి దిగారు. అనంతరం డాక్టర్ శంకర్‌ను అంబులెన్స్‌లో ఎంజీఎంకు తీసుకెళ్లారు. కాగా, ఎంజీఎంలో సారయ్యను పరీక్షించిన వైద్యులు.. అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే సారయ్యకు పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో వైద్యుడు శంకర్ అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై సారయ్య కుమారుడు రాజేంద్రప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోపి తెలిపారు.

జిల్లా వైద్యాధికారుల విచారణ

ఇంజక్షన్ వికటించి మృతి చెందిన ఘటనపై డిప్యూటీ డీఎంహెచ్ఓ మధన్‌మోహన్, సీఐ గోపి విచారణ చేపట్టారు. ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. సారయ్యకు ఇచ్చిన ఇంజక్షన్‌పై ఆరా దీశారు. అనంతరం ఆస్పత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కాలం చెల్లిన ఇంజక్షన్లు, మందులు గుర్తించారు.

నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రి నిర్వహణ

ఆస్పత్రి నిర్వహణ నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్నారని డిప్యూటీ డీఎంహెచ్ఓ మధన్‌మోహన్ తెలిపారు. విచారణ అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదునెలల క్రితం ఇంజక్షన్ వికటించి ఓ బాలుడు మృతి చెందడంతో ఆస్పత్రి సీజ్ చేసినట్లు తెలిపారు. ఓ వైపు విచారణ కొనసాగుతుండగానే అక్రమంగా ఆస్పత్రి నిర్వహిస్తున్నారని చెప్పారు. కాగా, ఐదు నెలల క్రితం ఆస్పత్రి సీజ్ చేసినా సేవలు కొనసాగిస్తున్న డాక్టర్ శంకర్‌పై ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఆస్పత్రి సీజ్

'శంకర్' ఆస్పత్రిని సీజ్ చేశారు. తహసీల్దార్ ప్రసాద్, డీటీ రహీం, ఆర్ఏ ప్రణయ్.. ఆస్పత్రికి సీల్ వేశారు. వైద్యాధికారులు వాణిశ్రీ, విజమ్‌రావు, ఏఎస్‌వో ప్రసన్నకుమార్, హెల్త్ అసిస్టెంట్లు కందుకూరి సంతోష్‌కుమార్, ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.